
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 14 । జనవరి । 2023



పోలీసుల అదుపులో గుప్త నిధుల ముఠా

గుప్త నిధుల తవ్వకాల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. IIలో



టమాట కిలో రూ.12

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.12 పలికింది. కనిష్టం రూ.3, సరాసరి రూ.6 ప్రకారం అమ్మకాలు జరిగాయని ఏడీఎం తెలిపారు.


గరిష్టం/కనిష్టం

31.7°/8.2°

జిల్లా పరిధిలో శుక్రవారం చలి తీవ్రత అధికంగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగాను తగ్గాయి. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

సంతోషాల సంక్రాంతి

- భోగి పండుగకు సర్వం సిద్ధం
- ఇంటింటా సంక్రాంతి సందడి
- బంధువులతో కళకళలాడుతున్న పల్లెలు





సాక్షి, పుట్టపర్తి: సంక్రాంతి సంబరాలకు జిల్లా సన్నద్ధమైంది. సంక్రాంతి లక్ష్మిని ఆహ్వానించేందుకు ప్రతి లోగిలీ ముస్తాబైంది. కొత్త అల్లుళ్ల రాక... పిండి వంటల సువాసన, గంగిరెద్దుల గజ్జల చప్పుల్లు చిన్నారుల గాలిపటాలు, జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో సంక్రాంతి శోభ కనిపిస్తోంది. ముత్యాల ముగ్గులు స్వాగతం పలుకుతుండగా.. ఇంటముంగిట గొబ్బెమ్మలు ముచ్చట గొలుపుతున్నాయి. నేడు భోగి మంటలకు సిద్ధం చేశారు. పండుగ షాపింగ్‌తో పట్టణంలో రద్దీ పెరిగింది.

మార్కెట్‌కు సంక్రాంతి శోభ..

సంక్రాంతి పండుగంతా మార్కెట్‌లోనే కనిపిస్తోంది. ఎటు చూసినా జనంతో వీధులన్నీ కిటకిటలాడుతున్నాయి. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ప్రకటించడంతో షాపింగ్ జోరందుకుంది. కూడళ్లు తిరునాళ్లను తలపిస్తున్నాయి. వస్త్ర దుకాణాలు, షాపింగ్ మాల్స్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల షోరూమ్‌లు.. ఇలా ప్రతి షాపూ కొనుగోలుదారులతో కిటకిటలాడుతోంది.

బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిట..

ఎక్కడున్నా సంక్రాంతికి స్వగ్రామం చేరడం తెలుగువారి ఆచారం. అందుకే ఎక్కడెక్కడో ఉంటున్న వారంతా పండుగ కోసం పల్లెల బాట పట్టారు. ఫలితంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి

శిల్పారామంలో సంబరాలు..

పుట్టపర్తి మున్సిపాలిటీ ఎనుములపల్లి సమీపంలోని శిల్పారామంలో మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు ఏఓ రమేష్‌రెడ్డి తెలిపారు. సంబరాల్లో భాగంగా శనివారం ముగ్గుల పోటీలు, ఆదివారం భరతనాట్యం, కూచిపూడి నాట్యం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

న్యూస్‌రీల్

సంక్రాంతిని ఆనందంగా జరుపుకోండి

పుట్టపర్తి టౌన్: జిల్లా ప్రజలు సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలని కలెక్టర్ బసంత్‌కుమార్ సూచించారు. రైతులు, గ్రామీణ వృత్తులవారు, ప్రజలు సుఖశాంతులతో తులతూగాలని ఆకాంక్షించారు. ప్రజల జీవితాలల్లో భోగి పండుగ భాగ్యాలు తేవాలని, సంక్రాంతి నవకాంతిని నింపాలని, అన్నదాతల ఇళ్ళుధాన్యరాశులతో నిండాలని, సిరులు కురవాలని భవంతున్ని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

వేమన జయంత్యుత్సవాలు విజయవంతం చేద్దాం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 19న కటారుపల్లిలో యోగి వేమన జయంత్యుత్సవాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేద్దామని కలెక్టర్ బసంత్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం ఆయన తన చాంబర్ నుంచి వేమన జయంత్యుత్సవాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేమన సమాధితో పాటు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో యోగి వేమన పద్యాలపై విద్యార్థులకు క్విజ్, వకృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బహిరంగ సభ ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా హాజరవుతారన్నారు. 18వ తేదీలోపు ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రామచంద్ర, జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న హాకీ ఆంధ్రప్రదేశ్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు

ధర్మవరం: జిల్లా జూనియర్ బాలుర హాకీ జట్టును శుక్రవారం ఎంపిక చేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. అందులో ప్రతిభ కనబరచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బంధనాథం సూర్యప్రకాష్ తెలిపారు. జిల్లా జట్టు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు నంద్యాలలో జరిగే 13వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హాకీ పోటీల్లో పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చలి తీవ్రత



అనంతపురం అగ్రికల్చర్: చలి తీవ్రత కొనసాగుతోంది. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పడిపోయాయి. రాత్రి, వేకువజాము వేళల్లో చలి ఎక్కువగా ఉంటుండటంతో ఉమ్మడి జిల్లా ప్రజలు వణికిపోతున్నారు. శుక్రవారం శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో 8.2 డిగ్రీలు, అనంతపురం జిల్లా బెలుగుప్పలో 9.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక అగళి 8.5 డిగ్రీలు, నల్లచెరువు 9.2, శెట్టూరు, తనకల్లు 9.4, రొద్దం 9.5, గాండ్లపెంట 9.7, సోమందేపల్లి, కొత్తచెరువు 9.8, కనగానపల్లి 10.2, ఎన్‌పీ కుంట 10.3, ఓడీ చెరువు 10.4, కూడేరు 10.6, రాప్తాడు, విడపనకల్లు 10.7, హిందూపురం, లేపాక్షి, కంబదూరు, తలుపుల 10.8, గుడిబండ 10.9 డిగ్రీల కనిష్ఠం నమోదు కాగా.. మిగతా మండలాల్లో 11 నుంచి 15 డిగ్రీల మధ్య కొనసాగాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో గరిష్ట ఉష్ణోగ్రతలు 27 నుంచి 32 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. ప్రధానంగా మడకశిర, హిందూపురం, కదిరి, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో చలి వాతావరణం అధికంగా నెలకొంది. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

మంత్రి సంక్రాంతి శుభాకాంక్షలు



కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు సుఖ సంతోషాలతో, భోగభాగ్యాలతో జీవించాలని, రైతులు సిరి సంపదలతోమార్థికాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో ప్రజలంతా భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఇంటిల్లిపాది ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

- హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి



హౌసింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ చంద్రమౌళిరెడ్డి

ఓడీ చెరువు: జగనన్న గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఓడీ చెరువు మండలానికి 3,689 ఇళ్లు మంజూరయ్యారన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఇప్పటి వరకు కేవలం 888 ఇళ్లకు మాత్రమే జియోట్యాగింగ్ పూర్తి చేశారని, మిగిలిన వాటన్నింటికీ ఈ నెల 21వ తేదీలోపు జియో ట్యాగింగ్ పూర్తి చేయాలన్నారు. అలాగే ఇప్పటికే ప్రారంభమైన నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అర్హులందరికీ ఇల్లు మంజూరు చేయాలని సూచించారు. అవసరమైన సామగ్రి అందజేసి ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఫర్వీన్‌బాను,జెడ్పీటీసీ కుర్లి దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ పోలప్ప, హౌసింగ్ డీఈ నాగరాజు,ఏఈ హరిప్రసాద్‌రెడ్డి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శంకరునికి 'సూర్య' నమస్కారం



కనగానపల్లి: ముక్తాపురంలోని ముక్తీశ్వరాలయ శివ లింగంపై సూర్య కిరణాలు పడుతున్నాయి. రెండు రోజుల నుంచి సూర్యోదయం వేళ ఈ సూర్య కిరణాలు పడుతుండటంతో భక్తులను అబ్బురపరుస్తోంది.

సాయి మార్గమే జీవితానికి దిక్సూచి



ది ఫ్యమిలియర్ స్ట్రేంజర్ నాటికలోని ఓ ఘట్టం



హాజరైన భక్తులు, విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: సత్యసాయి బాబా చూపిన మార్గమే మానవ జీవితానికి దిక్సూచి అని ముద్దేనహళ్లి క్యాంపస్ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థల విద్యార్థులు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ మందిరంలో సత్యసాయి వార్షిక క్రీడా సాంస్కృతిక సమ్మేళనంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ది ఫ్యమిలియర్ స్ట్రేంజర్ పేరుతో నాటికలు ప్రదర్శించి సత్యసాయి భక్తులను ఆకట్టుకున్నారు. మనిషి జీవన యానంలో భగవంతుడి గమ్యాన్ని చేరుకోవడానికి ఏవిధంగా కృషి చేస్తాడనే విషయాలను తెలియజేశారు. అనంతరం భజనలు, గీతాలాపన తర్వాత మంగళ హారతితో కార్యక్రమాలు ముగిశాయి. అనంతరం ససత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ కళాకారులకు సత్యసాయి చిత్రపటాలను బహూకరించారు. క్రీడా సమ్మేళనంలో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు వేదపఠనం, 'సాయి స్వర లయాంజలి' పేరుతో సంగీత కచేరీ ఉంటుంది. సాయంత్రం సత్యసాయి ఉన్నత విద్యాసంస్థలు బృందావన్ బ్రాస్ బ్యాండ్ ఆధ్వర్యంలో సంగీత కచేరీతో పాటు 'కింగ్‌డమ్ ఆఫ్ హెవెన్' పేరుతో నృత్య నాటిక ప్రదర్శిస్తారు.

మృగాళ్లను వదలొద్దు

- పోక్సో కేసుల్లో వెంటనే చార్జ్‌షీట్లు దాఖలు చేయండి
- టెలీకాన్ఫరెన్స్‌లో ఎస్పీలకు డీఐజీ ఎం.రవిప్రకాష్ ఆదేశం



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఐజీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: చిన్నారులపై లైంగిక దాడులకు సంబంధించిన పోక్సో కేసుల్లో చార్జ్‌షీట్ త్వరితగతిన దాఖలు చేసి మృగాళ్లకు శిక్షపడేలా చూడాలని అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్ ఎస్పీలను ఆదేశించారు. శనివారం రేంజ్ పరిధిలోని అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్పీలతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీజీపీ ఆదేశాల మేరకు గత ఏడాది నమోదైన పోక్సో కేసుల్లో చార్జ్‌షీటు దాఖలు చేయాల్సిన అంశం, యూఐ, డ్రగ్స్ కేసులపై డీఐజీ సమీక్ష నిర్వహించారు. పిల్లలపై జరిగిన అఘాయిత్యాలకు సంబంధించి ప్రతి ఎస్పీ ఐదు కేసులు, డీఎస్పీలు చెరో ఐదు కేసులను వ్యక్తిగతంగా పర్యవేక్షించి కోర్టుల్లో ముద్దాయిలకు శిక్షలు పడేలా అన్ని చర్యలూ చేపట్టాలన్నారు. ఒకటి కంటే ఎక్కువగా పోక్సో కేసుల్లో నిందితులుగా ఉన్న వారిపై షీట్స్ ఓపెన్ చేసి నిఘా ఉంచాలని సూచించారు. నాలుగు జిల్లాల్లో డీఎస్పీలు జడ్జీలను కలిసి సీసీ నంబర్లు తీసుకునేలా ఎస్పీలు పర్యవేక్షించాలన్నారు. యూఐ (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులు తగ్గించాలన్నారు. యూఐ కేసుల విషయమై డీఎస్పీలు, సీఐలతో ఎస్పీలు సమావేశమై ఆదేశాలు జారీ చేయాలన్నారు. డ్రగ్స్ తయారీ, సరఫరా, విక్రయం, కొనుగోలు వరకు సంబంధమున్న అందరిపైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు కంటే ఎక్కువ కేసుల్లో ఉన్న నిందితులపై డ్రగ్స్ షీట్స్ ఓపెన్ చేయాలన్నారు. రేంజ్ పరిధిలోని ముఖ్యమైన పట్టణాల్లో డ్రగ్స్ రహితంపై అవగాహన కల్పిస్తూ డిగ్రీ, ఇంజినీరింగ్, తదితర కళాశాలలు, విశ్వ విద్యాలయాల వద్ద హోర్డింగులు పెట్టాలన్నారు. డ్రగ్స్ వల్ల జరిగే చెడు, దుష్ప్రభావాలను తెలియజేస్తూ పోస్టర్లను కళాశాలల ఆవరణలో అతికించాలన్నారు. ఎస్పీలు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు కళాశాలలను సందర్శించి డ్రగ్స్ వాడకంతో కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. రౌడీషీటర్ల కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలన్నారు. రౌడీలు పేట్రేగి దుడుకు చర్యలకు పాల్పడితే పీడీ యాక్టు ప్రయోగించాలని ఆదేశించారు. సంక్రాంతి సందర్భంగా జల్లికట్టు, కోడి పందేలు, బెట్టింగులు, గ్యాంబ్లింగులు జరగకుండా చూడాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్పీలు ఫక్కీరప్ప, రాహుల్ దేవ్‌సింగ్, పరమేశ్వరరెడ్డి, రిషాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

తీరిన సబ్జెక్టు టీచర్ల కొరత

- 985 మంది ఉపాధ్యాయులకు సర్దుబాటు




కౌన్సెలింగ్‌ను పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జి డీఈఓ ఎం.వెంకటకృష్ణారెడ్డి

అనంతపురం: ప్రభుత్వ పాఠశాలల్లో మూడో తరగతి నుంచి విద్యార్థులకు సబ్జెక్టు టీచర్లతో బోధన చేయించేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 985 మంది ఎస్జీటీలకు సబ్జెక్టు టీచర్లుగా అవకాశం కల్పించింది. వీరిలో 2022 అక్టోబర్‌లో పదోన్నతి ఆసక్తి తెలిపిన 191 మంది సీనియర్ ఎస్జీటీలు ఉన్నారు. విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తికి అనుగుణంగా లెక్కించి మిగిలిన పోస్టులు (సర్‌ప్లస్) 652, సబ్జెక్టు మార్పు 142 రెండూ కలిపి 794 (ఉదాహరణకు స్కూల్ అసిస్టెంట్ మేథమేటిక్స్ నుంచి ఫిజిక్స్, ఇంగ్లిష్ నుంచి స్కూల్ అసిస్టెంట్) చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లను, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి ఆసక్తి తెలిపిన 191 మంది మొత్తం 985 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. దీంతో విద్యార్థులకు సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయుల కొరత తీరినట్లయ్యింది. ప్రతి ఉన్నత పాఠశాలలోనూ అన్ని సబ్జెక్టులు బోధించే స్కూల్ అసిస్టెంట్లు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకున్నారు.

ముగిసిన కౌన్సెలింగ్..

అనంతపురం సైన్స్ సెంటర్‌లో 2022 అక్టోబర్‌లో పదోన్నతికి సమ్మతి తెలిపిన ఉపాధ్యాయులకు స్థానాలు కేటాయించే కౌన్సెలింగ్ శుక్రవారం ముగిసింది. సీనియార్టీ ప్రకారం పారదర్శకంగా పోస్టింగ్‌లు కేటాయించారు. కౌన్సెలింగ్‌ను అనంతపురం ఇన్‌చార్జ్ డీఈఓ ఎం.వెంకటకృష్ణారెడ్డి కౌన్సెలింగ్‌ను పర్యవేక్షించారు. శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి, అనంతపురం డీవైఈఓ పద్మప్రియ, పెనుకొండ డీవైఈఓ రంగస్వామి పాల్గొన్నారు.



క్లుప్తంగా

18 నుంచి రహదారి భద్రతా వారోత్సవాలు

అనంతపురం సెంట్రల్: రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా ఈనెల 18 నుంచి 24 వరకూ రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉప రవాణా కమిషనర్ శివరామప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18న నగరంలో అంబేడ్కర్‌భవన్‌లో ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం వారం రోజుల పాటు అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ డ్రైవర్లు, స్కూల్ బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సులు, ఉచిత వైద్య పరీక్షలు, రోడ్డు నియమ నిబంధనలపై అవగాహనా ర్యాలీలు, సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఐక్యకార్యాచరణతో పోరాటం


పోస్టర్లు విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం అర్బన్: ఐక్య కార్యాచరణతో యూటీఎఫ్ ముందుకు సాగుతుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోంలో శుక్రవారం యూటీఎఫ్ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశాన్ని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి కోటేశ్వరప్ప, ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, కార్యదర్శి నాగేంద్ర తదితరులు హాజరై మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేసి వాటిని సాధించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు బూతన్న, సహాధ్యక్షుడు బాబు, కోశాధికారి సుధాకర్, జిల్లా కార్యదర్శులు తాహెర్‌వలి, శ్రీనివాసులు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గుప్త నిధుల ముఠా

- నల్లమాడ, సోమగుట్టపల్లి వద్ద తవ్వకాలు
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలం సోమగుట్టపల్లి అటవీ ప్రాంతం దగ్గర గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారంమేరకు... శ్రీసత్యసాయి జిల్లాలోని నల్లమాడ మండలం సోమగుట్టపల్లి వద్ద భారీగా గుప్త నిధులున్నట్లు కర్ణాటకకు చెందిన స్వామీజీ షేక్ నిజాముద్దీన్ ద్వారా ఓ ముఠా తెలుసుకుంది. ఈ గుప్త నిధులను తవ్వేందుకు అనంతపురం జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డులో నివాసం ఉంటున్న మాజీ కానిస్టేబుల్ ఇంటిని కేంద్రంగా చేసుకుని పక్కా ప్రణాళిక రచించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఈ ముఠాకు సంబంధించిన సభ్యులు రెండురోజుల పాటు అనంతపురంలోనే బస చేశారు. శుక్రవారం ఉదయం అనంత నుంచి బయలుదేరి వెళ్లిన ముఠా సభ్యులు స్వామీజీ చెప్పిన ప్రకారం గుప్తనిధులు ఉన్నాయని భావించిన ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారి విగ్రహాన్ని అక్కడ పెట్టి కొన్ని కెమికల్స్‌తో పూతలు పూశారు. అనంతరం సమీప ప్రాంతానికి చెందిన శంకరరెడ్డి అనే వ్యక్తికి సంబంధించిన మనుషులతో పాటు మరొకరికి చెందిన జేసీబీని తీసుకుని అమ్మవారి విగ్రహం పెట్టిన ప్రాంతంలో తవ్వకాలు చేపట్టారు. అటవీ ప్రాంతం కావడం, జనసంచారం పెద్దగా లేకపోయినా గొర్రెల కాపరులు, పొలాల్లో వ్యవసాయ పనులు చేసుకునే వారు జేసీబీ తవ్వకాల శబ్దాలు విని నల్లమాడ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అటు వైపుగా వెళ్తుండగా... పోలీసు ఉన్నతాధికారులకు సైతం సమాచారం తెలియడంతో వారి సహకారంతో వాహనాల తనిఖీ కూడా చేపట్టారు. తనిఖీలు ముమ్మరం కావడంతో నిందితులు మొలకవేముల వైపు తప్పించుకుని వెళ్లారు. కాగా అక్కడ మరో పోలీసు బృందం కంట పడిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ స్వామీజీతో పాటు శంకరరెడ్డి, మరికొందరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు అందులో ఓ మాజీ ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు, అతని కుమారుడు స్వామిజీతో కలసి తీయించుకున్న ఫొటోలు లభ్యమయ్యాయి. దీనికి తోడు నిందితులంతా అనంతపురం హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఓ మాజీ కానిస్టేబుల్ ఇంట్లో తల దాచుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడికావడంతో ఆ దిశగా శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా కర్ణాటక స్వామీజీ నిజాముద్దీన్‌తో పాటు ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మాజీ కానిస్టేబుల్ కుమారుడు కూడా పట్టుబడిన వారిలో ఉన్నట్లు సమాచారం.


సోమగుట్టపల్లి వద్ద జేసీబీతో తవ్వకాలు చేపట్టిన దృశ్యం


తవ్వకాల ప్రాంతంలో ఉంచిన అమ్మవారి విగ్రహం


షేక్‌నిజాముద్దీన్ స్వామీజీ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు నారాయణప్ప

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి కోడూరుతోపు దగ్గర ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో నారాయణప్ప (54) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు... నారాయణప్ప బెంగళూరు వైపు నుంచి అనంతపురం వైపు వెళ్తుండగా కోడూరు తోపు దగ్గర బైక్ అదుపు తప్పింది. ప్రమాదంలో గోరంట్ల మండలం గొల్లపల్లికి చెందిన నారాయణప్ప తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. హమీద్ అనే మరో వ్యక్తికి తీవ్రగాయాలు కాగా హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని రైతు మృతి


సూర్యనారాయణ (ఫైల్)

ముదిగుబ్బ: మండల కేంద్రానికి చెందిన సూర్యనారాయణ (60) అనే రైతు శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... దొరిగిల్లు రోడ్డులోని సత్యసాయి వాటర్ పంప్ హౌస్ ఎదురుగా సూర్యనారాయణకు వ్యవసాయ పొలం ఉంది. పొలంలోకి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంలో రోడ్డుపైకి రాగా.. అటు వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సూర్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మీదేవి, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తూకంలో తేడాలొస్తే డీలర్లపై చర్యలు


తూకాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ తిప్పేనాయక్

ధర్మవరం అర్బన్: స్టోర్‌లో నిరుపేదలకు అందించే బియ్యం తదితర వస్తువుల పంపిణీలో తూకంలో తేడాలొస్తే డీలర్లపై చర్యలు తప్పవని ఆర్డీఓ తిప్పేనాయక్ హెచ్చరించారు. పట్టణంలోని మార్కెట్‌వీధిలో ఉన్న చౌకధాన్యపు డిపోలను శుక్రవారం తనిఖీ చేశారు. స్టోర్లలోని బియ్యం, కందిబేడలు పరిశీలించారు. చక్కెరను తూకం వేశారు. నాణ్యమైన బియ్యం, కందిబేడలను ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. ఎవరైనా స్టోర్ డీలర్లు తప్పుడు తూకాలు వేసినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ చెన్నకేశవనాయుడు, వీఆర్వో యోగీశ్వర్‌రెడ్డి, స్టోర్ డీలర్ల సంఘం అధ్యక్షుడు పరంధామరెడ్డి పాల్గొన్నారు.

చౌక దుకాణాల తనిఖీ

పుట్టపర్తి అర్బన్: నగర పంచాయతీ పరిధిలోని గోవిందపేట, పెద్దబజారులోని చౌకధాన్యపు దుకాణాలను శుక్రవారం పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు రిజిష్టర్లను పరిశీలించారు. స్కేలును పరిశీలించి తూకాల్లో మోసం చేయొద్దని డీలర్లను హెచ్చరించారు. ఎండీయూ ఆపరేటర్లను అనుసంధానం చేసుకుని లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి బియ్యం అందించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచితంగా బియ్యం అందజేస్తున్నాయన్నారు. అక్కడే ఉన్న లబ్ధిదారులతో మాట్లాడి, సక్రమంగా బియ్యం అందజేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. బియ్యం, చెక్కెర, బేడలకు డీడీలు తీసి తెప్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ షబ్నం, డీలర్లు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


దాడుల్లో స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లు

హిందూపురం: హిందూపురం సెబ్ పోలీసుస్టేషన్ పరిధిలో పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించి ఐదు బాక్సుల్లో 480 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. నిందితుడు చిలమత్తూరు మండలం సోమఘట్ట–గోరంట్ల వెళ్లే దారిలో ఎర్రబల్లి గ్రామానికి చెందిన వడ్డే లక్ష్మీనారాయణను అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే ఒక ద్విచక్ర వాహనం , ఐదు బాక్సుల కర్ణాటక మద్యం హాయివార్డ్స్ విస్కీ డిప్స్ 480 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో ఎస్‌ఐ లు పోతలయ్య, శంకర్, హెచ్‌సీ, పీసీలు పాల్గొన్నారు.

చిన్నారి దుర్మరణం


చరణ్‌నాయక్ (ఫైల్)

అమడగూరు: మండలంలోని మలకవారిపల్లి ఎగువతండాలో ట్రాక్టర్ కింద పడి చరణ్‌నాయక్ (3) మృతి చెందాడు. గ్రామస్తుల వివరాలమేరకు... మలకవారిపల్లి ఎగువతండాకు చెందిన రమేష్‌నాయక్, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక్క కుమారుడు. అయితే రమేష్‌నాయక్ శుక్రవారం ట్రాక్టర్‌కు రోటావేటర్ వేసుకుని పొలం దున్ని ఇంటికి చేరుకున్నాడు. బాలుడు చరణ్ ట్రాక్టర్ నడుపుతున్న తండ్రిని చూసి నాన్నా... అంటూ ట్రాక్టర్ వద్దకు వచ్చాడు. బాలుడిని గమనించని తండ్రి పొరపాటుగా ట్రాక్టర్ రోటావేటర్ తగటడంతో చరణ్ అక్కడిక్కడే మృతి చెందాడు. చిన్నారి మృతితో తండాలో విషాదచాయలు అలముకున్నాయి. అప్పుడే నిండు నూరేళ్లు నిండిపోయాయా నాన్నా అంటూ తల్లితండ్రులు కన్నీరు మున్నీరుగా రోదించడం అందరి హృదయాలను కలచివేసింది.





పవన్‌కు మహిళలంటే గౌరవం లేదు

- ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

హిందూపురం: 'మహిళలను గౌరవించే సంస్కారం లేని వ్యక్తి జనసేన అధినేత పవన్ కళ్యాణ్. సంప్రదాయాలను పక్కన పెట్టి మూడు పెళ్లిళ్లు, ఆరుబంధాలు కొనసాగించి.. ఏడడుగుల బంధాన్ని అపహాస్యం చేశారు' అని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ విమర్శించారు. యువశక్తి పేరుతో శ్రీకాకుళంలో నిర్వహించిన సభపై ఎమ్మెల్సీ స్పందించారు. శుక్రవారం ఎమ్మెల్సీ క్యాంప్ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు. పెళ్లిళ్లు చేసుకుని విడాకులిచ్చిన మహిళలు ఫిర్యాదులు చేసి ఉంటే పవన్‌కళ్యాణ్‌కు కూడా ఖైదీనెంబర్ ఇచ్చేవారన్నారు. యువత గురించి మాట్లాడుకుండా మహిళలను కించపరిచేలా మాట్లాడతారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువతకు మంచి సందేశమివ్వాలేగాని ఇలా అసభ్య పదజాలంతో దుషణలకు దిగి ఏం నేర్పాలనుకున్నారని ప్రశ్నించారు. మూడు ముక్కలని మాట్లాడటం పవన్‌కళ్యాణ్ వక్రబుద్ధికి అద్దం పడుతోందన్నారు. శ్రీబాగ్ ఒప్పందం, కమిటీ నివేదిక ఆధారంగానే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన వికేంద్రీకరణతో మూడు కారిడార్లుగా రాష్ట్రాభివృద్ధికి కృషిచేస్తున్నారని స్పష్టం చేశారు. దీన్ని పరిహాసంగా మూడు ముక్కలు అని ఎద్దేవా చేయడం సరి కాదన్నారు. ప్రశ్నిస్తా అంటూ డాంబాలు పలికే పవన్‌కళ్యాణ్... ఓటుకు నోటు కేసు వ్యవహారంలో టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు తాకట్టు పెట్టినప్పుడు ఎందుకు ప్రశ్నించలేదో చెప్పాలన్నారు. పదేళ్లు ఉమ్మడి రాజధానిగా ఉండాల్సిన హైదరాబాద్‌ను రాత్రికి రాత్రి ఖాళీ చేసినప్పుడు ఎందుకు నోరు విప్పలేదో చెప్పాలన్నారు. నిజంగా పవన్ కళ్యాణ్‌కు చిత్తశుద్ధి ఉంటే ఓటుకు నోటు వ్యవహారంలో సీబీఐ విచారణకు సిద్ధం కావాలని చంద్రబాబుకు చెప్పగలరా అని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తోడు దొంగలను విమర్శించారు.

మోత్కుపల్లిలో టీడీపీ నాయకుడి దౌర్జన్యం

హిందూపురం: పట్టణంలోని 21వ వార్డు మోత్కుపల్లిలో టీడీపీ మీడియా కోఆర్డినేటర్ చంద్రమోహన్ దౌర్జన్యానికి దిగారు. ఇదే విషయంపై బాధితుడు గోవిందు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మోత్కుపల్లిలో చంద్రమోహన్, గోవిందు పక్క పక్కనే ఉన్న ఇళ్లలో నివాసముంటున్నారు. అయితే ఇద్దరి ఇళ్ల మధ్య ఉన్న కాస్త ఖాళీ స్థలం వ్యవహారంపై చాలా రోజులుగా ఇద్దరి మధ్య గొడవ జరుగుతోంది. ఆ స్థలం తమదంటే తమదని వాదించుకుంటున్నారు. దీనిపై గోవిందు పలుమార్లు అధికారులకు అర్జీలు కూడా ఇచ్చారు. తన స్థలాన్ని సర్వేచేయకుండా, కిటికీలు పెట్టనివ్వకుండా దౌర్జన్యం చేస్తూ అడ్డుపడుతున్నాడంటూ చంద్రమోహన్‌పై.... గోవిందు స్పందన, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఇరువర్గాలు గొడవకు దిగాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. గ్రామంలో ఉద్రిక్తత జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

బర్రెలను తరలిస్తున్న కంటైనర్ సీజ్



గోరంట్ల: గుడిబండ మండలం నుంచి కేరళ రాష్ట్రానికి అక్రమంగా కబేళాకు తరలిస్తున్న బర్రెలు , ఎద్దులతో ఉన్న కంటైనర్‌ను పట్టుకున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. కంటైనర్ వాహనం (ఎంహెచ్15 జీవీ 2700)ను శుక్రవారం పాలసముద్రం క్రాస్ వద్ద సీజ్ చేశామన్నారు. గుడిబండకు చెందిన ఈడిగ మంజునాథ్, కేరళ రాష్ట్రానికి చెందిన అబ్దుల్ మాతలిబ్‌లను అరెస్టు చేశామన్నారు. 39 బర్రెలు, రెండు ఎద్దులను గోషాలకు అప్పగించినట్లు సీఐ వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

NURSING ASST. TRAINING

■ 10th / ఇంటర్ / డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన మహిళలకు నర్సింగ్ అసిస్టెంట్ కోర్స్ నందు ఫ్రీగా ట్రైనింగ్ ఇచ్చి, జాబ్ కల్పించబడును. సంప్ర॥ G.మురళి, 9030661651, ATP. [A-752468]

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

■ గ్రామ సచివాలయం / పోలీస్ కానిస్టేబుల్/S.I (ప్రిలిమ్స్ & మెయిన్స్) / స్పోకెన్ ఇంగ్లీష్ / RRB / VRO / VRA అభ్యర్థులకు ఉచిత శిక్షణకై. సంప్ర॥ లిటిల్ ఫ్లవర్ స్కూల్, ATP. 9290200675. [A-243]

శ్రీ శ్రీనివాస ట్యుటోరియల్స్

■ Inter I, IInd years & - IPE 40 days Coaching (Maths, Phy, Chem) Short Term Coaching for NEET/JEE. Addr: Opposite: VISHAL MART, R.C. Nagar, ATP. Ph: 9618562274, 8500140577. [A-7969]

EDUCATION

■ రెగ్యులర్/డిస్టెన్స్/ఆన్‌లైన్/6MONTHS ONLY: 10th,12th, ANIMAL HUSBANDRY, VETERINARY B.A., BCOM, BSC, MA, MCOM, MSC, BSW, BLIC, B.B.A, B.C.A, LLB, MLT, DMLT, ANASTHESIA, OT, MPHW, MALE ANM, DIPLOMA, B.TECH, M.TECH, PHARMACY, BPT, MBA, MCA,AGBSC, PHD, KNL. CELL: 7013309825, 8686172989 [L-793242]

REAL ESTATE

5 ఫ్లోర్స్ బిల్డింగ్ బాడుగకు

■ ATP టౌన్, RTO ఆఫీస్ ఎదురుగాగల రోడ్ నందు 5 సెంట్లలో 5 ఫ్లోర్స్ బిల్డింగ్ కాలేజ్ / స్కూల్స్ / కోచింగ్ సెంటర్స్‌కి అనువైన ఫర్నీచర్‌తో (ఆఫీస్‌లకు, హాస్టల్స్/ బ్యాంక్స్ / ఫైనాన్స్ సంస్థలకు) బాడుగకు కలదు. సెల్: 9948870035, 7569994305. [A-752470]

PLOT FOR SALE

■ GMR COLONY, Alamuru Road, Anantapur. AHUDA approved open plots for sale. Cont: 9392183377, 9281024684, 9391756322. [A-261]

■ HIGHWAY COUNTY, Beside APS Warehousing Godowns, near SVIT, NH 44, AHUDA approved plots for sale. 9392183377, 9281024684, 9391756322. [A-260]

■ GREEN COUNTY, Rapthadu, NH 44, AHUDA approved open plots for sale. Cont: 9392183377, 9281024684, 9391756322. [A-259]

TOLET / SALE

■ రాంనగర్‌లో షాపు బాడుగకు / అమ్మకానికి కలదు. చికెన్ షాపుకి వర్కర్స్ కావలెను. సంప్ర॥ సెల్ : 8074429294, 9542093517. [A-257]

FOR SALE

■ ప్రముఖ కాలేజీ యందు సివిల్, మెకానికల్, ఎలెక్ట్రికల్, కంప్యూటర్ ల్యాబ్స్ పరికరములు అమ్మకమునకు కలవు. సెల్ : 8309781667. [A-752473]

EMI ద్వారా ఫ్లాట్లు

■ శ్రీలక్ష్మీ టౌన్ షిప్ నందు EMI పద్ధతిలో రెసిడెన్షియల్ / కమర్షియల్ ఫ్లాట్స్ తక్కువ ధరల్లో డెవలప్‌మెంట్స్‌తో కలవు. వెంటనే సంప్ర॥ లక్ష్మి : 9642999005. [A-752467]

SERVICES

శ్రీ కృష్ణ జ్యోతిష్యాలయం

■ మైసూర్ కి చెందిన ప్రఖ్యాత జ్యోతిష్యులు శ్రీ జనార్ధన్ జ్యోషి గారు మీ హస్తరేఖ, జాతకం చూసి సంపూర్ణ భవిష్యత్ చెప్పెదరు. విద్య, ఉద్యోగ, వ్యాపార, సంతాన, స్త్రీ/పురుష ప్రేమ, భార్యభర్తల సమస్య, ఆరోగ్యం, వ్యాపారం, విదేశీయానం, మనశాంతి మొ॥ అన్ని సమస్యలకు శాస్త్రోక్తంగా, అతిశీఘ్రంగా సంపూర్ణ పరిహారం చూపబడును. దూర ప్రాంతాలవారు ఫోన్ ద్వారా సంప్రదించవచ్చును : 9908626148. [A-235]

WANTED

■ శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, అనంతపురము నందు సేల్స్ ఆఫీసర్స్‌గా పనిచేయుటకు మార్కెటింగ్ రంగంలో 3 సం॥ల అనుభవం కల్గి, స్థానికులుగా ఉన్నవారు కావలెను. సెల్ : 9440943333 [A-2320]

■ నిరుద్యోగ యువతులకు శుభవార్త, 100% శిక్షణ, Job, ఉచిత భోజన వసతితో, మరిన్ని వివరాలకు NiCETS, ATP. సెల్: 95779 81999, 82999. [A-2267]

■ ఇంటిదగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000 నుంచి 20,000 వరకు జీతం. మరిన్ని వివరాలకై సంప్ర:6301728311 [G-776030]

■ ప్రముఖ బ్యాంక్ నందు పని చేయుటకు డిగ్రీ అర్హత కల CSO, క్లర్క్, క్యాషియర్, బ్యాంక్ ఆఫీసర్ అర్జెంటుగా కావలెను. (M/F) ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో సంప్రదించండి. 81429 06890. [NA-10406]

■ బయో మాగ్నెటిక్ హెల్త్ ప్రొడక్ట్స్ కొరకు మార్కెటింగ్ చేయువారు M/F కావలెను. Qly: Any డిగ్రీ, (వర్క్‌ఫ్రమ్ హోమ్) మంచి ఆదాయం, పార్ట్ టైం & ఫుల్‌టైం. సంప్ర: 7416404028. [H-792695]

■ ATP లో ప్రముఖ హార్డ్‌వేర్, గ్లాస్ & ప్లైవుడ్ షాపులో హెల్పర్‌గా పనిచేయుటకు, 25-30 సం॥ల వయస్సుగల యువకులు కావలెను. చదువు అవసరం లేదు. స్థానికులకు మాత్రమే. Cont: 9440287989. [A-258]

■ శ్రీలక్ష్మీ టౌన్‌షిప్‌లో పనిచేయుటకు GM, M.M., M.E., టెలికాలర్స్ కావలెను. రిటైర్డ్ / అనుభవంగల వారికి ప్రాధాన్యత. జీతం + ఇన్సెంటీవ్స్. సెల్: 9642999004, 9642999005 [A-752474]

■ ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు, బిల్డింగు కట్టుటకు అనుభవజ్ఞులయిన సివిల్ ఇంజనీర్లు కావలెను. సంప్ర॥ సెల్: 8309781667. [A-752472]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776023]

■ ప్రముఖ SBATS, జాన్‌డీర్ ట్రాక్టర్ షోరూం నందు ఉద్యోగావకాశాలు కలవు. (1) సేల్స్ ఎగ్జిక్యూటివ్స్-6, ట్రాక్టర్ డ్రైవింగ్ తెలిసి, ఇంప్లిమెంట్స్‌తో నడపగలిగిన వారికి ప్రాధాన్యత. (భార్య భర్తలు కలిసి వర్క్ చేసే అవకాశం). (2) ఫోటోషాప్ + ఫోటో & వీడియో ఎడిటింగ్ డిజైనర్స్-2, (3) టెలికాలర్స్ - లేడీస్-2, (4) అకౌంట్స్ TALLY-1 పై జాబ్స్‌కి అనుభవమును బట్టి ఆకర్షణీయమైన వేతనం ఇవ్వబడును. సెల్: 9852277111. Mail ID: sbatsactivitypdiandclaimsmanager@sbats.co.in [A-253]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఉప్పిడిపల్లికి చెందిన దాళప్ప (50) శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ నాగేంద్ర తెలిపిన వివరాలమేరకు... దాళప్పకు తరచూ కడుపు నొప్పి వస్తుండేదన్నారు. ఆ సమయంలో మద్యం సేవించేవాడన్నారు. ఈ నేపథ్యంలోనే దాళప్ప ఇంట్లోనే దూలానికి ఉరేసుకొని చనిపోయాడని పేర్కొన్నారు. మృతుని భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే ఇంటి పెద్ద దిక్కును కోల్పోయామని, ఇక బతకడం ఎలా దేవుడా అంటూ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

హైవేపై కారు దగ్ధం



సోమందేపల్లి: మండలంలోని పేటకుంట సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం ఓ కారు దగ్ధమైంది. పోలీసుల వివరాలమేరకు... బెంగళూరుకు చెందిన ఆదిల్ షా మరో ఇద్దరితో కలిసి కారు (కేఏ50ఎన్5289)లో అనంతపురం బయలు దేరారు. అయితే కియా అనుబంధ సంస్థ ఎస్ఎల్‌పీపీ కంపెనీ సమీపంలోకి రాగానే కారు డివైడర్‌ను ఢీ కొనడంతో కారు టైరు నుంచి మంటలు చెలరేగాయి. కారులో ఉన్నవారు గమనించి సురక్షితంగా కిందకు దిగిపోయారు. మంటలు దట్టంగా వ్యాపించడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI DIGITAL MEDIA GROUP | SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్,హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు **9912220717**

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.